# కథావేదిక

**మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం**

# నేనున్నానని...

**-అయ్యగారి శ్రీనివాసరావు**



"నేనింత సీరియస్‌గా మాట్లాడుతూంటే ఎందుకలా నవ్వుతారాంటీ" అంది ఉష. అలా అంటున్నామె మాటల్లోనూ, ముఖంలోనూ ఉడుకుమోతుతనం స్పష్టమైంది నాకు. అనకూడదు గాని ఆ స్థితిలో ఆ అమ్మాయి ముఖం చూస్తే ముద్దొస్తూంది కూడా.

కానీ ఏ భావాన్ని వ్యక్తం చేయలేదు ఆమె విషయంలో. ఎందుకంటే ఆమె ఇప్పటికే సమస్యతో బాధపడుతోంది.

"ఆంటీ..." ఆలోచనల్లో ఉన్న నన్ను మళ్ళీ పిలిచింది ఉష. దాంతో ఆలోచనలు కట్టిపెట్టి ఈలోకంలోకి వచ్చాను. ఆమె మాటలకి జవాబుగా-

"ఉషా! కష్టాలు కలకాలం కాపురం ఉండవు. అదీకాక నీ సమస్య నువ్వనుకున్నంత పెద్దదేం కాదనిపిస్తోంది నాకు" అన్నాను. అంతకంటే ఏం చెప్పాలో అర్థంకాలేదు.

"అయితే నేనే చిన్న సమస్యని పెద్దది చేస్తున్నానంటారా ఆంటీ?" అడిగింది. ఆ అడగడంలో నిజాయితీ ఉంది. ఆత్మవిమర్శనా ధోరణి ఉంది.

"పెద్దది చేస్తున్నానని కాదుగాని..." అంటూ ఆపై ఏం చెప్పాలో అర్థంకాక ఆగిపోయాను.అలాంటి స్థితిలో ఉన్ననాకు 'నేనుగాని ఆమె మాటల్ని అపార్థం చేసుకోలేదు కదా?' అనిపించింది. అంతలోనే 'నేను ఆమె స్థానంలో ఉండి ఆలోచిస్తే...' అన్పించింది. ఎందుకంటే ఇతరుల సమస్యలు వారికి మాత్రం పెద్దవిలా కనబడుతాయి. కాని ఎవరి సమస్యలు వారికి మాత్రం పెద్దవిలా కనబడతాయి. ఇక్కడ సమస్యకి సొంతదారు ఉష. ఎదుటిమనిషిని నేను. అందుకే ఆమె వైపు నుంచి ఆలోచించాలని అనిపించింది. అదే చేశాను. తేడా తెలిసింది. 'నిజమే ఇందులో తప్పంటూ ఎవరిదీ లేదు. అలాగని ఆమె బాధపడడంలోనూ నిజం లేకపోలేదు. ఎందుకంటే మధ్యతరగతి జీవనసరళే అది. కొంత కలిగితే పొంగిపోవడం, కొంత తగ్గితే కుంగిపోవడం' ఇలా ఆలోచిస్తున్న నాతో ఉష అంది "ఆంటీ! నా మాటల్తో మీకు విసుగు కల్గించినట్లున్నాను. సర్లెండి. నా సమస్యల్ని మీ తలకెక్కించి మిమ్మల్ని బాధపెట్టడం నాకిష్టం లేదు. దాని గురించి మరిచిపోండాంటీ" అంటూ పిలుస్తున్నా పలకకుండా వెళ్లిపోయింది. నా మాటలతో బాగా హర్ట్ అయిందనిపించింది. ఆమె ఒక సమస్య చెప్పి పరిష్కారం చూపించమని అడిగింది. కానీ నేను చేసిందేమిటి? అది సమస్యే కాదనేశాను. అలా చెయ్యకుండా ఉండవలసింది అనిపించింది. అంతలోనే మళ్ళీ

"నిజంగా ఆమెది సమస్యేనా?" అనే అనుమానం కల్గుతోంది.

* * *

"నేనొచ్చేసరికి ఆలస్యమవుతుంది. నాకోసం చూడకు" గోడకో, తలుపు చెక్కకో చెప్పినట్లు చెప్పి జవాబు కోసం ఎదురుచూడకుండా బయటికెళ్లిపోతున్న శ్రీవారి మాటలకు ఆనందమనిపించింది.

"ఏరోజూ లేనిది ఇవ్వాళ చెప్పి వెళ్లడమా?" ఆశ్చర్యమో, ఆనందమో అర్థం కాని స్థితి నాది. పూర్తిగా ఆ స్థితిని అనుభవించకుండానే వెనుకనుంచి మాటలు వినబడ్డాయి.


"మమ్మీ! చాలా ఆకలి! టిఫిన్ పెట్టవా?" అన్న పెద్ద పాప పావని మాటలవి.

"పాపా! ఆ షూ విప్పేసి బట్టలు మార్చుకుని ముఖం కడుక్కునిరా! టిఫిన్ పెడతాను" అన్నాను.



## అటూ...ఇటూ... బిటీ

బంగారం సినిమాలో పవన్ కళ్యాణ్ సరసన నటించిన మీరాచోప్రా నితిన్‌తో సత్యం-శివం-సుందరం చిత్రంలో నటించింది. సిద్ధిక్ దర్శకత్వంలో మీరా చోప్రా నటనలో ఎన్నో మెళకువలు నేర్చుకుందిట. మోడలింగ్‌తో కెరీర్‌ను ప్రారంభించిన మీరా ఢిల్లీలో ప్రాథమిక విద్యను అభ్యసించి యుఎస్‌లో ఉన్నత విద్యాభ్యాసం చేసింది. ఎన్‌డి టీవీలో పని చేసిన అనుభవం ఉంది. తమిళ హీరో ప్రశాంత్‌తో జంబవన్, మాధవన్‌తో మరో సినిమాలో నటించింది.




ఆ మాటలు విన్న పావని "ప్లీజ్ మమ్మీ! ఐ హేవ్ నో విగర్. డోంట్ బాదర్ మీ" అంటూ ఏమనుకుందో గానీ బూట్లు మాత్రం బలవంతంగా లాగేసి పడేసింది. ఆమె అలసిన ముఖాన్ని చూసి మరేమీ అనలేకపోయాను. ఎందుకంటే దానికున్న టైం చాలా తక్కువ. రాత్రి హోంవర్క్ చెయ్యడానికి టైం ఉండదు. తెల్లారిలేస్తే ఆదరాబాదరాగా చెయ్యకపోతే స్కూల్లో భయంకరమైన పనిష్మెంట్లు. పోనీ డ్యాన్స్, మ్యూజిక్‌లు తర్వాతెప్పుడైనా నేర్పిద్దామంటే భర్త వినడాయె. 'అన్నింట్లోనూ ప్రావీణ్యం ఉండాలి' అంటాడు. అలా అన్న పెద్దమనిషి ఒక్కరోజైనా ఏ సాయమైనా చేశాడా అంటే అదీ లేదు. ఇలా గొలుసుకట్టుగా అన్నీ గుర్తొచ్చి ఆ పిల్లని ఏమనలేకపోయాను. దాని అవసరాలు తీర్చి అది ఆదరాబాదరాగా పరిగెత్తుతూంటే జాలిగా చూస్తూ నిట్టూర్చాను. అంతలోనే రెండోరంగం సిద్ధమైంది. రెండో పిల్లాడు స్కూల్‌నుంచి రావడం, ట్యూషన్‌కెళ్ళేవరకూ ఇందాకటి గుడి గుంచమే. వాడటు వెళ్లగానే మామగారి అవసరాలు తీర్చవలసిన టైం. ఆ తర్వాత వంట. అలా అలా ఒకదాని తర్వాతొకటి. "నేనేం చేస్తున్నాను?" అని కనీసం ప్రశ్నించుకునే సమయం కూడా లేకుండా యంత్ర సదృశంగా అలా అలా జరిగిపోన్నాయి పనులు. 'ఎన్ననుకున్నాను? ఎన్ని కలలు కన్నాను? ఎన్ని ఊహల ఊయలలూగాను? ఏవీ? అవన్నీ ఏమయ్యాయి, కన్న కలలన్నీ ఎందుకు కల్లలయ్యాయి?' ఒక్కసారిగా పెనుకెరటంలా వచ్చిన ఆలోచనలు నన్ను చుట్టుముట్టాయి. అంతలోనే అనిపించింది 'ఏనాడూ లేనిది ఇవాళేంటీ ఆలోచనలు?' అని. అప్పుడు గుర్తొచ్చింది ఉష.

'ఇంతసేపూ ఉష పడుతున్న బాధంతా ఇదే కదా? ఏమంటుందామె?'

"ఎన్నో ఆశలతో, ఆశయాలతో, మధురోహలతో వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టానాంటీ. నగలడిగానా, నాణ్యాలడిగానా? లేదే. తనివితీరా కొద్దిక్షణాలు ఆప్యాయంగా మాట్లాడమన్నాను. కరువుతీరా ఒక్కరోజు నా ఎదుట ఉండమంటున్నాను. దానికి టైం లేదంటున్నారు. ఇలాగే యంత్రంలా పనిచేసుకుంటూ పోతే కొన్నాళ్లకి మనమూ యంత్రాలం అయిపోతామని భయంగా ఉందాంటీ. మనమూ మనుషులమే అని గుర్తుంచుకోవాలంటే కనీస స్పందన కావాలాంటీ. అదే కరువైంది" చెవిలో ఉష అన్న మాటలే గింగురుమంటున్నాయి. ఆమె బాధ నాకిప్పుడు ఖచ్చితంగా అర్థమైంది. ఆ బాధకీ పరిష్కారం చూపాలి. అది నా ఒక్కదానివల్లా కాదు. చరణ్‌తో మాట్లాడాలి.

* * *

"జీవితం ఒక వరం చరణ్" అన్నాను నా మాటలకి నాందిగా.

"ఔనాంటీ! వెరీ నైస్ ప్రోవెర్బ్" అన్నాడు చరణ్ ఆ హాల్లో అటూ ఇటూ తిరుగుతూనే. అతడన్న మాటలకి నవ్వొచ్చినా ఆపుకున్నాను. చరణ్ మాత్రం ఆగకుండా హడావుడిగా అక్కడి వస్తువిక్కడ పెడుతున్నాడు. అక్కడ్నుంచి బ్రీఫ్‌కేస్‌లో పెడుతున్నాడు. అంతలోనే నేనొకదాన్ని ఉన్నానని గుర్తొచ్చిందేమో! "మీరు చెప్పండాంటీ వింటున్నాను" అన్నాడు నా వైపు చూడకుండానే. ఈలోకంలోనే ఉన్నానన్నట్టు "హమ్మయ్య" అనుకుని చెప్పడం మొదలెట్టాను.

"అనుభూతులు, సరదాలు ఉంటే జీవితానికి కొంత రిలాక్సేషన్ చరణ్" అన్నాను.

ఆ మాట విన్నతడు "యా....యా..యూ ఆర్ కరెక్ట్ ఆంటీ" అన్నాడు.

'ఇలాగే మాట్లాడుతూ అసలు విషయం చెప్పాలి' అనుకుంటున్నంతలో సెల్‌ఫోన్ రింగయింది. అంతే "వన్‌మినిట్ ఆంటీ" అంటూ ఫోన్‌లో మాట్లాడడం మొదలుపెట్టి హడావుడిగా బయలుదేరి వెళ్లిపోతూ "సారీ ఆంటీ! అర్జంట్ పని ఉంది. మరోసారి మాట్లాడదాం" అంటూ జవాబుకైనా ఎదురు చూడకుండా కనీసం భార్యకైనా చెప్పకుండా ఆదరాబాదరా బయటికెళ్లిపోయాడు. దాంతో నా బుర్ర గిర్రున తిరిగిపోయింది. అప్పుడు చూశాను ఉష వైపు. 'అర్థమైందా నా బాధ?' అన్నట్లున్నాయామె చూపులు. ఆ చూపులో

భావాలెన్నో, బాధ, భయం, నిర్లిప్తత, నిరాశ అన్నీ కలగలిపి ఉన్నాయి. ఆమె ముఖాన్ని ఆ స్థితిలో చూసి ఏమనాలో అర్థంకాలేదు నాకు. అప్పుడే ఒక స్థిర నిశ్చయానికొచ్చాను. ఎలాగైనా ఆమె సమస్యకి పరిష్కారం చూపించాలని.

* * *

"చరణ్ కావాలి" అన్న నా మాటలకి ఆ ద్వారం దగ్గరున్న అమ్మాయి నా వైపు అదోలా చూసింది. ఆ చూడడంలో కొంత కోపం పాలుంది. ఆమె ఎందుకలా చూసిందో అర్థంకాలేదు నాకు. అంతలోనే నా వయసుని, తీరుని చూసి ఏమనుకుందో గాని "యుమీన్ మా బాస్ చరణ్ సారా?" అడిగింది.

అప్పుడు గుర్తొచ్చింది నేను చేసిన పొరబాటు.

'నేనిప్పుడున్నది చరణ్ ఇంట్లో కాదు. కొన్ని వందలమంది ఉద్యోగుల మీద అధికారి అయిన చరణ్ ఆఫీసులో ఉన్నాను' అని.

"ఔను. మీ బాస్ చరణ్ సార్ గురించే" అన్నాను ఆ సీటుకి గౌరవం ఇస్తూ.

"ఓ గంట వెయిట్ చేయాలి మేడం. సార్ ఇంపార్టెంట్ మీటింగ్‌లో ఉన్నారు" అంటూ నేను కూర్చోడానికి కుర్చీ చూపించింది.

కుర్చీలో కూర్చుని చుట్టూ పరిశీలించాను. స్టాఫ్ అంతా ఎవరి పనుల్లో వారున్నారు. ఎదురుగా కనబడుతోంది చరణ్ ఛాంబర్. అద్దాలతో చేసిన క్యాబిన్ కావడంతో అక్కడ జరిగేదంతా స్పష్టంగా కనబడుతోంది. చరణ్ ఎవరితోనో చర్చలు జరుపుతున్నాడు. సూచనలిస్తున్నాడు. మధ్యమధ్యలో కంప్యూటర్‌లో ఏదో చూస్తున్నాడు. ఫోన్‌లు అందుకుంటున్నాడు. చేస్తున్నాడు. ఎవరెవరో వస్తున్నారు. వెళుతున్నారు. ఏవేవో ఫైల్స్ చూపిస్తున్నారు. సంతకాలు, సూచనలు, సలహాలు తీసుకుంటున్నారు. అన్నీ చేస్తున్నా ముఖంలో విసుగు కనబడలేదు. పెదవులపై చిరునవ్వు చెదరలేదు. అలాంటతడ్ని చూస్తే ముచ్చటేసింది. చిన్నవయసులో వచ్చిన ఉద్యోగం. కష్టపడి పని చేసేతత్వం. ప్రతి పనినీ అంకితభావంతో చేసే గుణం. ఎవరినీ నొప్పించడం చాతకాని మనస్తత్వం. అలాంది అంత బాధకి గురిచేస్తున్నాడంటే తన భర్త లాగా బాధ్యతారాహిత్యం ఏమో అనుకుందిన్నాళ్ళు. కానీ ఇప్పుడు కళ్లారా చూస్తూంటే విషయం అర్థమైంది. చిన్నతనం. తెలిసిన అతడ్ని తనే అపార్థం చేసుకుంది. అలాంటిది ఈమధ్యనే వచ్చిన ఉష ఒక లెక్కా? అనిపించింది. ఒక్కక్షణం ఛాంబర్ ఖాళీ అవ్వడంతో కుర్చీలో వెనక్కి వాలి, మెడ వెనక్కి వంచి కళ్ళమీద చేతులు వేసుకుని రెండునిముషాలు రిలాక్స్ అవ్వడం కనిపించింది. అలాంటిస్థితిలో అతడ్ని చూసిన నాకు జాలేసింది. అతడిలా నిజంగా పనుల ఒత్తిడి ఉన్న మగాడైతే ఏ భార్యా బాధపడదు. తన భర్తలాంటి పలాయనవాదులతోనే ఎన్నో వేల, లక్షలమంది ఇల్లాళ్ళు గుట్టుగా కాపురాలు చేసుకుంటున్నారు. ఒక నవ్వుకోసం, ఆప్యాయంగా పలకరించే పలకరింపు కోసం, చిలిపిగా దగ్గరకు లాక్కునే కౌగిలింత కోసం, మధురంగా మాట్లాడే కమ్మని మాట కోసం కలలుగనే ఇల్లాళ్ళెందరో. కానీ ఆ కోరికలన్నీ తన భర్తలాంటి భర్తల పేకాట వ్యసనాల వల్ల, గుర్రప్పందాల అలవాటు వల్ల, బార్‌లో గడిపే సమయం వల్ల, నలుగురు సోంబేరులుగా కలిసి చెప్పుకునే పోచికోలు కబుర్ల వల్లనో ఆ యిల్లాళ్ళ మధురమైన కోరికలన్నీ ఆవిరైపోతున్నాయి.

కాని ఉష విషయం అలా కాదు. ఆమె భర్త విషయంలో ఒకరకంగా అదృష్టవంతురాలు. కానీ ఎంత మంచితనం ఉన్నవాడైనా ఇల్లాలి కనీస కోరికలు తీర్చకపోతే ఆ మగాడు నేరస్థుడే. కానీ చరణ్, ఉషల సమస్యకి మాత్రం పరిష్కారం చూపగలననిపించింది.

* * *

"వస్తానాంటీ!" బాబుని నాకప్పగించి ఆఫీసుకెళ్లబోతున్న ఉష కళ్ళల్లో తృప్తి. అది చూసి చిలిపిగా నవ్వుతూ "సండే బాగా ఎంజాయ్ చేసినట్టున్నారే!" అన్నాను. ఆ మాటకి జవాబు సిగ్గుతో కూడిన చిరునవ్వు రూపంలో వచ్చింది. ఆ తర్వాత "మీకోపరేషన్ ఉండబట్టి మాకీ ఆనందం సాధ్యమైంది. లేకుంటేనా.." అంటూ ఊహించడానికే భయపడిపోయి ఆగిపోయింది.

ఆ మాట విన్న నేను "నిత్యం పని ఒత్తిడికి గురై యాంత్రికమైన జీవితాలని మనమే ఏదోలాగ ఆనందమయంగా మలచుకోవాలి. ఇంతకీ చరణ్, నువ్వూ కూడా నా మాట విని జీవితాన్ని ప్లాన్ చేసుకున్నందువల్లే ఈ ఆనందం మీకు దక్కింది. చరణ్ వారానికొకసారి తన పనులన్నీ వదిలి నీతో గడపడం, నువ్వూ కూడా భర్తకోసమే రోజూ చూడకుండా చిన్నదో పెద్దదో ఒక ఉద్యోగంలో చేరడంతో మీ సమస్యకి పరిష్కారం దొరికింది. యాంత్రిక జీవితం గడుపుతున్న ఈ కాలపు మనుషులంతా ఇలాగే ఎవరికి తోచిన పంథాలో వారు పయనిస్తే అంతా ఆనందమే" అన్నాను.

ఆ మాటకి జవాబు చెప్పవలసి ఉన్నా టైం లేకపోవడంతో "వస్తానాంటీ!" అని పరుగులాంటి నడకతో ముందుకు సాగిపోయింది ఉష.

★



## అభిమానం...

సూపర్, మహానంది, అస్త్రం, విక్రమార్కుడు... తాజాగా శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి దర్శకత్వంలో నటిస్తున్న అనుష్క సైకాలజీలో డిగ్రీ చదివింది. అంతే కాకుండా కంప్యూటర్ అప్లికేషన్స్‌లో బిసిఎ చదివిన ఈ బెంగుళూరు భామ ప్రస్తుతం తెలుగు భాషను నేర్చుకోవడంలో బిజీగా ఉంది. అభిషేక్‌బచ్చన్ అంటే ఎంతో అభిమానంగల అనుష్క, ప్రస్తుతం బాలకృష్ణ సరసన హీరోయిన్‌గా నటిస్తోంది.

